


కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ధర్నా

ప్రజాశక్తి - క్యాంపస్, విజయవాడ



'చలో విజయవాడ'లో భాగంగా శుక్రవారం తిరుపతి జిల్లా నుంచి దాదాపుగా 250 మంది కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ వ్యవసాయ కళాశాల కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకులు గండికోట నాగవెంకటేష్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి వర్యులు ఎన్నికల సందర్భంగా గెలిచిన తర్వాత అధికారం చేపట్టాక సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని ప్రకటించారని, అందర్నీ రెగ్యులరైజ్ చేస్తోందన్న ఆశతో ఎదురుచూస్తున్న తరుణంలో జూన్, 2014 జూన్ నాటికి పనిచేస్తున్న 10,117 మందిని రెగ్యులర్ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వలన తీవ్ర ఆందోళనకు అసంతృప్తికి దారి తీస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వరలక్ష్మి, రాకేష్, చంద్రమ్మ, గుణ, సాయి, మునిలక్ష్మి, సరస్వతి, గౌరి, మురళి, భువన పాల్గొన్నారు.

పకడో... పకడో..! 'ఆపరేషన్ బంటి' షురూ..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఇపుడు కొండపై చిరుతతో పాటు, ఎలుగుబంటి సంచారమూ భక్తులకు భయాందోళనకు గురిచేస్తోంది. ఓ వైపు 'ఆపరేషన్ చిరుత' కొనసాగుతూ మూడు బోనుల్లో చిక్కాయి. భక్తులకు భద్రత కల్పిస్తూనే 'ఆపరేషన్ చిరుత' కొనసాగుతుందని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. ఇదిలా ఉండగా శ్రీవారి మెట్టు మార్గంలో ఏడో మైలు వద్ద తరచూ ఎలుగువంటి సంచరించిన దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డయ్యాయి. 'పట్టుకోండి చూద్దాం... పకడో... పకడో..' అంటూ ఎలుగుబంటి నిత్యం నడకదారిలో భక్తుల సెల్‌ఫోన్ల చిత్రాలకూ చిక్కుతోంది. దీంతో 'ఆపరేషన్ బంటి'ని టిటిడి ఉన్నతాధికారులు ప్రారంభించారు. నడకదారిలో ఎక్కడా తినుబండారాలను జంతువులకు పెట్టవద్దని, షాపుల వారు సైతం అంగళ్ల వద్ద వ్యర్థాలను వేయరాదని భక్తులను అప్రమత్తం చేస్తున్నారు.

అలిపిరి నుంచి కాలినడకన వెళ్లే భక్తులకు అనేక సందర్భాల్లో ఎలుగుబంటి తారసపడింది. నిత్యం తిరుపతి నుంచి అలిపిరి, శ్రీవారిమెట్టు కాలినడక మార్గాల్లో భక్తులు, వ్యాపారులు నడచి తిరుమలకు చేరుకుంటుంటారు. సాధారణ రోజుల్లో కాలినడకన వెళ్లే భక్తుల సంఖ్య 20-25వేలు ఉంటుంది. వారాంతంలో 30-35వేలు ఉంటుంది. ప్రత్యేక రోజుల్లో కాలినడకన కొండకు చేరుకునే భక్తుల సంఖ్య 40వేలు దాటుతుంది. ఇటీవల కాలంలో నడచి వెళ్లే మార్గంలో వన్యమృగాల సంచారం మరింత ఎక్కువయ్యింది. ఓ వైపు చిరుతలు భయపెడుతుంటే, మరోవైపు ఎలుగువంటి సంచారం ఆందోళన కలిగిస్తోంది. శ్రీవారి మెట్టు ఏడో మైలు ప్రాంతంలో తరచూ ఎలుగువంటి సంచరించిన దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డయ్యాయి. భక్తులు చాలాసార్లు ఎలుగువంటి కనిపించిన విషయాన్ని టిటిడి సిబ్బంది దృష్టికి తీసుకొచ్చారు. కొంతమంది భక్తులు మొబైల్ ఫోన్‌లోనూ ఎలుగువంటిని ఫొటోలు తీశారు.

శ్రీవారిమెట్టు ఏడోమైలు వద్ద సిసికెమెరాల్లో రికార్డు



భక్తులు అందించిన సమాచారంతో టిటిడి 'ఆపరేషన్ బంటి' కార్యక్రమం చేపట్టింది. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. ఇందుకోసం 25 మంది సిబ్బందిని ఇప్పటికే నడకదారిలో ఏర్పాటు చేసింది. ఎలుగువంటిని బంధించేందుకు ప్రత్యేక బోన్లు, వలలతో ఆపరేషన్ మొదలు పెట్టింది. రెండుసార్లు వలలకు చిక్కినట్లే చిక్కి ఎలుగుబంటి తప్పించుకుంది. 'పట్టుకోండి చూద్దాం' అంటూ బంటి ముప్పతిప్పలు పెడుతోంది. ఎక్కడైతే బంటిని బంధించేందుకు ఏర్పాట్లు చేశారో అక్కడే ధైర్యంగా తిరుగుతోంది. భక్తులను ఎప్పటికప్పుడు టిటిడి అధికారులు అప్రమత్తం చేస్తూనే, బంటిని బంధించేందుకు మరో బృందాన్ని రంగంలోకి దించుతోంది. శ్రీవారి భక్తుల్లో భయాన్ని నింపిన ఎలుగుబంటి ఎప్పుడు చిక్కుతుందో చూడాలి మరి.

ఆహార వ్యర్థాలు నడకదారిలో వేయొద్దు : టిటిడి

భక్తులకు టిటిడి కొన్ని సూచనలు చేసింది. నడకదారిలో సాధుజంతువులకు ఎలాంటి ఆహారం ఇవ్వొద్దని టిటిడి హెచ్చరిస్తోంది. వ్యర్థ పదార్థాలను షాపుల బయట వదిలేసేవారిపై చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చింది. భద్రత కోసం డ్రోన్లు వాడనుంది. 30 మీటర్ల దూరం కనబడేలా మెట్ల మార్గంలో ఫోకస్ లైట్లతో పాటు 500 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయనుంది. భక్తులను అప్రమత్తం చేసేలా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయనుంది. అలిపిరి, గాలిగోపురం, ఏడో మైలురాయి దగ్గర హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి భద్రతపై భక్తులకు అవగాహన కల్పించనున్నారు.

నాయుడుపేట హైస్కూల్లో వెట్టిచాకిరి

ప్రజాశక్తి - నాయుడుపేట

నాయుడుపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో వెట్టిచాకిరీ చేయించుకోవడం విమర్శలకు తావిచ్చింది. తన హవా ప్రదర్శించేందుకు విద్యార్థులతో పనిచేయిస్తూ, అడిగితే పొంతనలేని సమాధానాలిస్తున్నారు. ఈ విషయాన్ని ఖండించాల్సిన ప్రధానోపాధ్యాయులు సైతం ఆ ఉపాధ్యాయునికి వత్తాసు పలకడం గమనార్హం. శుక్రవారం మధ్యాహ్నం నాయుడుపేటలోని జడ్‌పి బాయ్స్ హాస్టల్లో స్కూలు సమయంలో ఆ స్కూల్లోని ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న ఎం.నాగరాజు కొంతమంది స్కూలు పిల్లలతో ఇటుకరాళ్లు మోయించడం, గుంతలు తీయించడం వంటి కూలి పనులు చేయించారు. ఈ విషయమై ఆ ఉపాధ్యాయుని 'ప్రజాశక్తి' వివరణ కోరగా ఇక్కడ దిగేందుకు ఎక్కేందుకు ఇబ్బందిగా ఉందని, నడిచే సమయంలో స్కూలు సిబ్బంది, విద్యార్థులు జారిపడే అవకాశం ఉందని, తన సొంత ఖర్చులతో వీటిని బాగు చేయిస్తున్నానని చెప్పారు. పిఇటి సమయంలో విద్యార్థులు ఆకతాయిగా తిరగకుండా వాళ్లతో శ్రమదానం చేయించామని సమాధానం ఇచ్చారు. స్కూలు ప్రధానోపాధ్యాయులు స్పందిస్తూ పిల్లలతోపని చేయించడం నిజమేనని, స్కూలు బాగు కోసమే చేయించామని వంతపాడారు. ఇలాంటి పనులు చేయించే సందర్భంలో పిల్లలకు ఏదైనా ప్రమాదాలు వాటిల్లితే బాధ్యత ఎవరిదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్‌కృష్ణ ప్రశ్నించారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.



విద్యార్థులతో ఇటుకరాళ్లు మోయిస్తూ...

20న గ్రూప్-1, 2 కోచింగ్ స్క్రీనింగ్ టెస్ట్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



ఆంధ్ర ప్రదేశ్ స్టడీ సర్కిల్ చే సివిల్ సర్వీసెస్ గ్రూప్ 1, గ్రూపు 2 కోచింగ్ కోసం దరఖాస్తు చేసున్నవారికి ఈ నెల 20న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు , పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పక్కగా చేపట్టాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని జిల్లా రెవెన్యూ అధికారి కోదండరామి రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో ఎ.పి.స్టడీ సర్కిల్ సివిల్ సర్వీసెస్ , గ్రూప్ 1, 2 కోచింగ్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణపై సంబంధిత శాఖలతో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.సి.వెల్ఫేర్ అధికారి చెన్నయ్య తో కలసి సమీక్ష నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు చోట్ల నిర్వహణ వుందని తిరుపతి జిల్లా కేంద్రంగా 5 పరీక్షా కేంద్రాల్లో 2325 మంది ఈ అర్హత పరీక్ష రాయనున్నారని, పరీక్షా సమయం ఆదివారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని అన్నారు. రాష్ట్ర పర్యవేక్షణ అధికారిని అన్నపూర్ణమ్మ, జిల్లా పర్యవేక్షణ అధికారి ఎస్.సి.వెల్ఫేర్ అధికారి చెన్నయ్యను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాల్లో గంట ముందు నుండే అనుమతి వుటుందని అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో హాల్ టికెట్ తో పాటు తప్పనిసరి ఫోటో ఐడి వుండాలని అన్నారు. ఈ అర్హత పరీక్ష రాయడానికి పలు జిల్లాల నుండి రానున్నారని , ఎపిఎస్‌ఆర్టిసి రవాణా సౌకర్యం కల్పించాలని, పరీక్షలనిర్వహణ సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, మెడికల్ క్యాంపుల ఏర్పాటు చూడాలని అన్నారు.

పరీక్షా కేంద్రాలు : ఎస్.వి.ఆర్ట్స్ కళాశాల వింగ్ "ఎ" లో 600 మంది , వింగ్ "బి" లో 600 మంది, శ్రీ పద్మావతిమహిళా డిగ్రీ, పి జి కళాశాల లో 600 మంది, శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాటశాలలో 300 మంది, ఎస్.వి.యునివర్సిటీ కాంపస్ హైస్కూల్ నందు 225 మంది అభ్యర్థులు ఈ అర్హత పరీక్ష రాయనున్నారని వివరించారు. ఈ సమీక్షలో పరీక్షా కేంద్రాల సూపర్‌వైజర్లు విద్యుత్ శాఖ డి ఇ శ్రీనివాసులు, ఆర్ టి సి ఎటిఎం డి ఆర్ నాయుడు , మెడికల్ ఆఫీసర్ ఉదయశ్రీ ,డి టి రామచంద్ర , పోలిస్ డిపార్ట్ మెంట్ బాలచంద్ర రాజు పాల్గొన్నారు.

ఈఎస్ఐ హాస్పిటల్‌లో ఎంపీ ఆకస్మిక తనిఖీ



తిరుపతి సిటీ : ఎంపి మద్దిల గురుమూర్తి శుక్రవారం తిరుపతి ఈఎస్ఐ హాస్పిటల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్పిటల్ లోని అన్ని విభాగాలను పరిశీలించి రోగులను, సిబ్బందిని అడిగి సమస్యలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సిబ్బంది పలు సమస్యలను ఎంపి దష్టికి తీసుకొచ్చారు. రాయలసీమలో ఉన్న ఏకైక ఈఎస్ఐ హాస్పిటల్ కావడంతో అత్యాధునిక వైద్య చికిత్స పరికరాలను ఏర్పాటు చేయవలసిన అవశ్యకత గూర్చి వారు ఎంపీ గురుమూర్తి దష్టికి తీసుకువచ్చారు. గతంలో ఈఎస్ఐ హాస్పిటల్ లోని అత్యాధునిక వైద్య పరికరాలు, మెషినరీ ఏర్పాటు చేయాలని పార్లమెంట్ లో పలుమార్లు సమస్య గూర్చి చర్చ లేవనెత్తిన విషయం అందరికీ విదితమే. అలాగే చుట్టు పక్కల జిల్లాలకు ఏకైక ఈఎస్ఐ హాస్పిటల్ అయిన తిరుపతి ఈఎస్ఐ హాస్పిటల్ ని, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గా గుర్తించి, ప్రస్తుతం 50 పడకలతో సేవలు అందిస్తున్న ఈ హాస్పిటల్ ను 100 పడకల హాస్పిటల్ గా విస్తరించాలని కేంద్ర మంత్రి దష్టికి తీసుకెళ్లామని ఎంపి తెలియజేశారు. అలాగే మంచినీటి సమస్య గూర్చి ప్రస్తావించగా ఇప్పటికే అక్కడ ఉన్న ఆర్‌ఓ ప్లాంట్‌ను వినియోగం లోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకొంటామని తెలియజేశారు. అక్కడ పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కాంట్రాక్టు ప్రాతిపదికన తీసుకోవాలని, గత దశాబ్ద కాలంగా జీత భత్యాలలో మార్పు లేకుండా ఉందని ఎంపి దష్టికి తీసుకు రాగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి తెలియజేసారు.

ఇంటర్ మోడల్ బస్‌స్టేషన్ నిర్మించాలి : ఎంపీ

తిరుపతి టౌన్ : తిరుపతిలో నిర్మించ తలపెట్టిన ఇంటర్ మోడల్ బస్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, నిర్మాణ కార్యాచరణ పురోగతిపై ఏపియస్ ఆర్టీసి, తుడా ఇంజనీరింగ్ విభాగం అధికారులతో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తిరుపతి బ్యాంకు ఎంప్లాయిస్ కాలనీలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ఇంటర్ మోడల్ బస్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించి కార్యాచరణలో జాప్యాన్ని నివారించి పనులు వేగవంతం చేసి త్వరలోనే శంకుస్థాపన చేసే విధంగా ముందుకెళ్లాలని, ఈ ప్రక్రియలో తన నుండి ఎలాంటి సాయం అవసరమైనా తక్షణమే సంప్రదించాలని కోరారు. ఈ సమీక్షలో ఏపియస్ ఆర్టీసి డివిజనల్ ఇంజనీర్, ఏపియస్ ఆర్టీసి అసిస్టెంట్ ఇంజనీర్, తుడా అడ్వైజర్ పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి బాసట

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

అనారోగ్య కారణాలతో మరణించిన హెూమ్ గార్డ్ పద్మేష్ బాబు భార్య యమున కు శుక్రవారం పోలీస్ పెరేడ్ మైదానం నందు జరిగిన కార్యక్రమంలో కారుణ్య నియామకాల కింద హెూంగార్డ్ గా ఉద్యోగం ఇప్పించి, ఉద్యోగ నియామక ఉత్తర్వుల పత్రాలను అందజేసి జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధులకు సంబంధించి, పోలీసు ఉద్యోగం విలువలను, నేటి సమాజంలో నడుచుకోవలసిన తీరును ఆమెకు వివరించారు. కుటుంబ ఆధారం కోసమో లేదా జీతం తెచ్చిపెట్టే ఒక ఉద్యోగం కోసమే కాక ప్రజలకు సేవ చేస్తున్నామనే భావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఉద్యోగంలో చేరే మొదటిరోజు ఎంతటి ఉత్సాహంతో విధులకు హాజరు అవుతారో అదే ఉత్సాహం చివరి వరకు కొనసాగాలని కోరారు. సమాజంలో పోలీసు విభాగానికి ఉన్న విలువలను కాపాడుతూ, తమ కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వహించాలని ఆమెకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, లక్ష్మీ నారాయణ రెడ్డి, ఏఆర్ డిఎస్పిలు రవీంద్రారెడ్డి, చంద్రశేఖర్, హెూంగార్డ్స్ ఆర్.ఐ శ్రీనివాసులు, ఆర్‌ఐలు చంద్రశేఖర్, రెడ్డప్ప రెడ్డి, చలపతి, నాగభూషణం, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.



నిమ్మ పరిశోధనా కేంద్రంలో...





కనీస వేతన చట్టం వర్తించదా..?

ప్రజాశక్తి - వెంకటగిరి రూరల్

'తెగుళ్లకు మందు పిచికారీ చేసేటపుడు పాములుంటాయి.. తేళ్లుంటాయి.. పనిచేసేటపుడు 'పాస్'కు వెళ్లి పని ఎగ్గొడతామంటే కుదరదు.. మాకు ఒళ్లొంచి పనిచేసేవారే కావాలి..' అంటూ నిమ్మ, చినీ పరిశోధనా స్థానంలో కాంట్రాక్టర్ హుకుం. 'మీకు ఇష్టముంటే చేయండి లేదంటే లేదు' అంటూ కూలీల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తూ పిఎఫ్ పేరుతో 54 రూపాయలు కట్‌చేసి, 250 రూపాయలు రోజు కూలి కింద లెక్క కట్టి ఇస్తున్నారు. పరిశోధనా కేంద్రం హెడ్ మధుమతి అండ చూసుకునే కాంట్రాక్టర్ ఆ విధంగా తమను వేధిస్తున్నారన్నది వారి ఆవేదన. తమకు కనీస వేతన చట్టం వర్తించదా? అని వారు వాపోతున్నారు.

తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం పెట్లూరు డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యానవనం నిమ్మ చిని పరిశోధనా కేంద్రంలో పనిచేసే కూలీలకు కనీస వేతన లేబర్ చట్టం అమలు కావడం లేదు. ఇక్కడ పనిచేసేవారంతా దళితులే. కూలీల మధ్యనే పోటీలు పెట్టి 'పనిచేసేవారే మాకు కావాలి' అంటూ తమకు ఇష్టమైన వారికే పనులు కల్పిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మహిళలు పనిచేస్తుంటే సూపర్‌వైజర్‌గా ఉండే అధికారి అక్కడే ఉంటూ మహిళలను కనీసం 'పాస్'కూ వెళ్లడానికీ వీల్లేకుండా వేధిస్తున్నారని సమాచారం. ఇటీవలే టైంస్కేల్ ఉద్యోగికి విధి నిర్వహణలో తేలుకుడితే పట్టించుకోలేదని, ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స చేయించుకుంటున్నానని 'ప్రజాశక్తి'తో వాపోయాడు. ఈ పరిశోధనా స్థానాన్ని మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఎంతో కృషి చేసి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం కోసం పెట్లూరు గ్రామ దళితులు సాగు చేసుకుంటున్న భూమిని సైతం జనార్ధన్‌రెడ్డి మాటకు కట్టుబడి అప్పట్లో ఇచ్చారు. అయితే భూములిచ్చిన కుటుంబ సభ్యులను పనుల్లో పెట్టుకోకుండా వేధిస్తున్నారని వారు వాపోతున్నారు.

పాములున్నా, తేళ్లున్నా పనిచేయాల్సిందే
కాంట్రాక్టు లేబర్ కూలీల ఆవేదన
రైతులకు నాసిరకం 'నిమ్మ' నారు విక్రయం



నాసిరకంగా 'నిమ్మపులుసు' నారు

ఈపరిశోధనా కేంద్రంలో నిమ్మ రైతులకు కొత్త వంగడాలను అందించాల్సి ఉంది. అధిక దిగుబడులు ఇచ్చే నిమ్మ నారు తయారు చేయాలి. గతంలో సీనియర్ శాస్త్రవేత్తలు తయారు చేసిన 'పులుసునిమ్మ', తిరుపతి బాలాజీ నిమ్మ మొక్కలనే ఎంతోకాలంగా రైతులకు అందిస్తున్నారు. పెట్లూరులో 'పులుసునిమ్మ' తల్లిచెట్లు నుంచి నాణ్యమైన, ఆరోగ్యకరమైన నిమ్మపండ్లను చెట్లనుంచి తీసి విత్తనాలు వేరుచేసి మొలకలు తయారు చేయాలి. కానీ అలాకాకుండా నాశిరకమైన నిమ్మపండ్ల నుంచి విత్తనాలు తీసి నిమ్మనారు తయారు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. తక్కువ వయస్సు ఉన్న నాశిరకం మొక్కలను రైతులకు అమ్మి సొమ్ము చేసుకోవడం తప్ప నాణ్యమైన మొక్కలను అందించలేకపోతున్నారు. దీంతో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఆశయాలు నీరుగారిపోయాయని రైతులు వాపోతున్నారు. రాపూరు, బాలాయపల్లి, డక్కిలి మండలాల మెట్టరైతులకు నిమ్మతోటలతో ఆర్థికంగా బలపడతారనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ కేంద్రాన్ని అప్పట్లో ఏర్పాటు చేశారు. మొక్కలు నాటినప్పటి నుంచి తెగుళ్లతో ఇబ్బందులు పడుతున్నా శాస్త్రవేత్తలు ఏమాత్రం సూచనలు ఇవ్వడం లేదన్నది వారి ఆవేదన. ఇకనైనా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పెట్లూరులోని వైఎస్‌ఆర్ నిమ్మ, చిని పరిశోధనా కేంద్రాన్ని పరిశీలించి కాంట్రాక్టు లేబర్ కూలీలకు, రైతులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



'తరతరాల తిరుమల పుస్తకం' ఆవిష్కరణ

తిరుపతి టౌన్ : సీనియర్ జర్నలిస్టు కుమార మంగళం నేతాజీ రాసిన 'తరతరాల తిరుమల' పుస్తకంను టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. పుస్తకంలోని సమాచారం భక్తులు, యాత్రికులకే కాకుండా, జర్నలిస్టులకూ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

త్వరలోనే శ్రీనివాస సేతు ప్రారంభం : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ తిరుపతి నగరంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద శ్రీనివాస సేతు తుది దశ పనులను శుక్రవారం తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శ్రీనివాస సేతు నిర్మాణ పనునలు చివరి దశకు చేరుకున్నాయని, మరో నెలలోపు అన్ని పనులను పూర్తి చేసి సిఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే మూడు విడతల్లో పనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. మరో నెలలోపు తుది పనులు పూర్తి చేసి సిఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ఆప్కాస్ సంస్థ ప్రతినిధి రంగస్వామి పాల్గొన్నారు.

శ్మశానాల ఆధునీకరణకు చర్యలు

తిరుపతి టౌన్ : నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని శ్మశానవాటికలను ఆధునీకరించేందుకు చర్యలు చేపడుతున్నామని కమిషనర్ హరిత అన్నారు. కరకంబాడి మార్గంలోని గోవిందధామంను శుక్రవారం ఉదయం ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. మత దేహాన్ని తీసుకు రావడం, ఖననం చేయడం, కర్మ కాండలు నిర్వహించే విషయాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఆరు శ్మశానవాటికలు ఉన్నాయని, మనిషి చివరి యాత్ర గౌరవప్రదంగా జరిగేలా అన్నింటినీ అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్లు ఆదం రాధారెడ్డి, బోకం అనిల్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్-1 ఫలితాల్లో జీఎస్ మాస్టర్స్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



జనరల్ స్టడీస్ మాస్టర్స్ విద్యార్థి పూజారి సాయి లహరి గ్రూప్1లో అత్యుత్తమ ప్రతిభ చూపి ఎంపీడీవో పోస్టుకు ఎంపికైందని జి ఎస్ మాస్టర్స్ వ్యవస్థాపకులు ఎం. శివనాదం తెలిపారు. స్థానిక సాయి నగర్ లోని ఆ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనరల్ స్టడీస్ మాస్టర్స్ (జీఎస్ మాస్టర్) అకడమిక్ ఎక్సలెన్స్‌ను పెంపొందించడానికి అంకితమైన అగ్రగామి పోటీ విద్యా సంస్థ. పబ్లిక్ సర్వీస్ కమీషన్ (ఏపీ ఎస్ సి) ఆంధ్ర ప్రదేశ్ గ్రూప్1 లో పూజారి సాయి లహరి పబ్లిక్ సర్వీస్ కమిషన్ అందుకుందన్నారు. లహరి క్రమ పద్ధతిలో శిక్షణ పూర్తి చేసి ఎంపీడీఓ పోస్టుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. తిరుపతికి చెందిన లహరి విజయం ఆమె సంపూర్ణ అంకితభావానికి మాత్రమే కాకుండా, ఆమె కుటుంబం నుండి పొందిన విలువలు, మార్గదర్శకత్వం, బలమైన పునాదిని ప్రతిబింబిస్తుంది అన్నారు. ఆమె తండ్రి పూజారి రామచంద్రయ్య టీటీడీ తిరుమలలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తల్లి పీఎంపీ ప్రాక్టీషనర్ రమ్యమణిలు ఆమెను మరింత ప్రోత్సహించారని తెలిపారు. సాయి లహరి మాట్లాడుతూ తన విజయంలో జీఎస్ మాస్టర్ పాత్ర కీలకమైనదన్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం తనను ఈ స్థాయికి నడిపించిందన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సుమంత్, మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ / రేణిగుంట



రేణిగుంట వద్ద గల వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ కాంపౌండ్‌లోని ఇవిఎం గోడౌన్‌ను శుక్రవారం కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జేసీ డికె బాలాజీ, డిఆర్‌ఓ కోదండ రామిరెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో పరిశీలించారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ తిరుపతి జిల్లాకు సంబంధించిన ఇవిఎంలను భద్రపరచడానికి భద్రతా ప్రమాణాల మేరకు గుర్తించి ఎన్నికల కమిషన్ అనుమతి మేరకు వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ కాంపౌండ్‌లో గోడైన్‌ను గుర్తించామన్నారు. ఇప్పటికే వివిపాట్స్ జిల్లాకు చేరుకున్నాయన్నారు. 24/7 పోలీస్ భద్రత, సి సి కెమరాల పర్యవేక్షణ , విజిటింగ్ రిజిస్టర్ వంటివి ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ , జేసి ల పర్యటనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు వైసిపి ప్రతినిధి ప్రభాకర్ , టిడిపి ప్రతినిది మునిరెడ్డి , రేణిగుంట తహసిల్దార్ ఉదయ్ సంతోష్ , ఎన్నికల తహసిల్దార్ సురేష్ పాల్గొన్నారు.

కరుణాకర్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

తిరుపతి టౌన్ : టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తిరుపతిలోని స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా కరుణాకర్ రెడ్డి కి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సరైన వ్యక్తికి రెండోసారి టి.టి.డి ఛైర్మన్ పదవి దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కరుణాకర్ రెడ్డి టి టి డి ఛైర్మెన్ పదవి చేపట్టడంతో ప్రజలకు స్వామి సేవలు మరింత చేరువవుతాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారి సేవలు విశ్వవ్యాప్తమయ్యేలా టిటిడి కషి చేయనుందని ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమంలో తిరుపతి రవీంద్రభారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ రవీంద్రారెడ్డి విశ్వం హైస్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు

వృద్ధాశ్రమానికి బియ్యం బస్తాలు వితరణ

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

డాక్టర్ పద్మభూషణ్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా రెండో కార్యక్రమం సూళ్లూరుపేట సాయి వృద్ధుల ఆశ్రమానికి నాలుగు బియ్యం బస్తాలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వద్ధాశ్రమం నిర్వాహకులు మస్తాన్ బాబు మాట్లాడుతూ సినీ రంగంలో చిరంజీవి మెగాస్టార్ అయితే, ఆయన అభిమానులు సేవా రంగంలో మెగాస్టార్ అయిపోయారని కొనియాడారు. అలాగే చిరంజీవి నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆశ్రమంలో ఉన్న పెద్దలంతా దీవించారు. ఈ కార్యక్రమలో చిరంజీవి సేవా సంఘం మాభాష, కోటి, శివకుమార్, సదానందం, కళ్యాణ్, నవీన్, పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా పుష్పయాగం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూళ్లూరుపేట శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానము నందు " నిజ శ్రావణమాసం తొలి శుక్రవారం" సందర్భముగా అమ్మవారికి అత్యంత వైభవముగా "పుష్పయాగం" నిర్వహించారు .ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి, కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాస రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో పుష్పయాగం ప్రారంభమయ్యింది. ఉభయకర్తలుగా నంబూరు మోహన్ రావు, సులోచనమ్మ, నంబూరు మనోజ్ సాయి, లత దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమములో శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు ముప్పాళ చంద్రశేఖర్ రెడ్డి, వంకా దినేష్ కుమార్, మన్నెముద్దు పద్మజ, కర్లపూడి సురేష్ బాబు, ఓలేటి బాల సత్యనారాయణ, మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు ముంగర అమరావతి, కామిరెడ్డి రేవతి, కళత్తూరు రామ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

'దిశా' హెడ్ కానిస్టేబుల్ శంకర్ రెడ్డికి ప్రథమ బహుమతి

తిరుపతి సిటీ : తిరుపతి కళ్యాణి డ్యాం పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో ట్రాన్స్ జెండర్ పర్సన్స్ ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ యాక్ట్ 20 19 మూడు రోజుల ట్రైనింగ్ విభాగంలో ఎస్సైలు టు హెడ్ కానిస్టేబుళ్లకు ఇండోర్ ట్రైనింగ్ జరిగింది. ఆన్లైన్ ఎగ్జామ్ నందు దిశా పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జి శంకర్ రెడ్డి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయన్ను అభినందించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పాకాల: పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెన్నై శంకర నేత్రాలయ ఆసుపత్రి వారి మిషన్ ఫర్ విజన్ ట్రస్టు సహకారంతో ఈనెల 20న ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాకాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరుగనున్న శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని.. వివరాలకు విజయబాబు ఫోన్‌నంబురు 8143337722 ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థికి అస్వస్థత



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి శ్రావణ్ కుమార్ శుక్రవారం ఉదయం పాఠశాలలో హఠాత్తుగా కుప్పకూలి అస్వస్థతకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న పాఠశాల పీఈటీ కిషోర్‌కుమార్, మస్తాన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించారు. విద్యార్థి మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడని.. జ్వరం తగ్గకపోవడంతో పాఠశాలలోనే కుప్పకూలిపోయారని వైద్యులు సూచించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ కి తరలించారు.

ఉప ఎన్నికలకు భారీ బందోబస్తు



ప్రజాశక్తి-పిచ్చాటూరు: అడవికొడియంబేడు సర్పంచ్, గోవర్ధనగిరి 7వ వార్డు మెంబర్ ఉప ఎన్నికలకు మొత్తం 97 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో ఓ డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఏడుగురు ఎస్ఐలు, 8 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 10 మంది ఎస్టీఎఫ్ పార్టీ, 69 మంది కానిస్టేబుళ్లు అందుబాటులో ఉంటున్నట్లు వివరించారు. శనివారం పోలింగ్‌కు నియమించిన పోలీసు సిబ్బందితో స్థానిక పోలీస్ స్టేషన్లో డీఎస్పీ సమావేశమై దిశానిర్దేశం చేశారు. అనంతరం పోలింగ్ జరిగే గ్రామాలైన అడవికొడియంబేడు, గోవర్ధనగిరి పంచాయతీలకు పంపారు.

కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత



ప్రజాశక్తి-ఏర్పేడు: ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో పల్లం సచివాలయంలో అంగన్‌వాడీలకు, వీసీపీసీ సభ్యులు, సచివాలయం సిబ్బందికి బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బత్తయ్య మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాలలో ముందుండాలని, బాలురుతో సమానంగా బాలికలను చూడాలని తెలిపారు. సీడీపీవో కృష్ణమంజరి, బాల్య వివాహాల కారణంగా కలిగే నష్టాలను, బాల్య వివాహ నిరోధక చట్టం, చదువు ప్రాముఖ్యతను వివరించారు. అలాగే పంచాయతీ కార్యదర్శి గోపి మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాలికలు అన్నిరంగాలలో రాణించాలని కోరారు. ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఎంఎస్‌కే తులసి, ఆరోగ్య సిబ్బంది లక్ష్మి, ప్రగతి మండల కోఆర్డినేటర్ శిరీష, సచివాలయం సిబ్బంది వెంకటేష్, వీసీపీసీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీకి ఇండియా టుడే 35వ ర్యాంకు



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రతిఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియా టుడే ర్యాంకుల విధానంలో జాతీయ 35వ ర్యాంకును ప్రభుత్వ వర్సిటీల కేటగిరీలో సాధించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి. భారతి మాట్లాడుతూ మొదటి ప్రయత్నంలోనే ఉన్నత ర్యాంక్ కు కృషి చేసిన ఐక్యూ ఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపుర సుందరి, టీం మెంబర్ లను అభినందించారు. కులసచివులు ఆచార్య ఎన్. రజిని మాట్లాడుతూ వర్సిటీ కి ఎటువంటి అనుబంధ కళాశాలలు లేకున్నా కూడా, టీచింగ్, నాన్ టీచింగ్ కృషితో విశ్వవిద్యాలయం 35 వ ర్యాంకు అందుకోవడం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటకృష్ణ, ప్రొఫెసర్ విద్యావతి, ప్రొఫెసర్ సీత, ఇతర ఐక్యూఏసి సభ్యులు పాల్గొన్నారు.

వేమాపురంలో ఉచిత వైద్య సేవలు



ప్రజాశక్తి-రేణిగుంట: విప్పమానుపట్టెడ పంచాయతీలోని వేమాపురం సంజీవరెడ్డి కాలనీలో శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వారిచే శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ వారి నిర్వహణలో వేమాపురం సంజీవరెడ్డి కాలనీలో ప్రజలకు వైద్యసేవలు అందించారు. వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మీపతిరెడ్డి మాట్లాడుతూ విప్పమానుపట్టెడ గ్రామంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించినందుకు బాలాజీ హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ సిబ్బంది, వాలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

నేడు ప్రకృతి ఆహారంపై అవగాహన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 19న శనివారం ఉదయం ప్రకృతి ఆహారం పై ఆహార శాస్త్ర నిపుణులు , రైతు నేస్తం ప్రకృతి వనం ప్రసాద్ అవగాహన కల్పిస్తున్నట్లు ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్ రాజు పేర్కొన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా చెన్నై పారిశ్రామికవేత్త శోభా రాజ పాల్గొంటారని తెలిపారు. ప్రతిఒక్కరూ ఈ అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాంకేతిక విద్యకు గ్రహణం..!

- ప్రభుత్వ బడుల్లో కనుమరుగు
- గ్రామీణ విద్యార్థులకు అందని కంప్యూటర్ పాఠాలు



ప్రజాశక్తి-ఓజిలి:
నేడు కంప్యూటర్ యుగం నడుస్తోంది. సాంకేతికం వైపు పరుగులు తీస్తోంది. ఏ కార్పొరేట్ విద్యాసంస్థలలో చూసినా ప్రాథమిక స్థాయి నుంచి కంప్యూటర్ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మాత్రం కంప్యూటర్ విద్యకు విద్యార్థులు దూరమయ్యారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై సరైన అవగాహన ఏర్పడటం లేదు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్య మిథ్యగా మారింది. పిల్లలకు చిన్ననాటి నుంచి కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలనే లక్ష్యంతో సర్కారు బడుల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంప్యూటర్ విద్యకు నిర్లక్ష్యం వైరస్ సోకింది. ఫలితంగా కంప్యూటర్ల గదులు మూతబడ్డాయి. కంప్యూటర్లు, ఇతర పరికరాలు మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. దీంతో పేదింటి పిల్లలకు కంప్యూటర్ విద్య మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. పేద విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలన్న సంకల్పంతో 2008 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి దివంగనేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో రాష్ట్రంలోని ఐదువేల పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలలలో ఒక్కొక్క ప్రాథమికోన్నత పాఠశాలకు ఐదు చొప్పున, జడ్పీ హైస్కూల్‌లో 11 చొప్పున పాఠశాలకు కంప్యూటర్లు అందించారు. వీటితోపాటు అవసరమైన ప్రింటర్లు, యుపీఎస్, ఫర్నీచర్ సమకూర్చారు. అయితే వీటిపై అప్పటిలో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కంప్యూటర్లు తుప్పు పట్టిపోయాయి. మరమ్మతులకు గురైన కొన్ని కంప్యూటర్లను జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి తరలించారు. మరికొన్ని చోట్ల చోరీకి గురైనట్లు సమాచారం. ఎక్కడలేని విధంగా నాడు-నేడు పనుల కింద రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతులతో అభివృద్ధి పరిచారు. అలాగే పేద విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను ప్రవేశపెడితే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. దీంతోపాటు మెరుగైన విద్యను అందించే సౌకర్యం కలుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

ఒప్పందం ముగిసింది

కంప్యూటర్ విద్యా బోధన నిర్వహణ బాధ్యతలను గతంలో నిట్ సంస్థకు ఐదేళ్లపాటు అప్పగించారు. దీంతో కంప్యూటర్ విద్యను బోధించేందుకు సంస్థ ప్రతి పాఠశాలలో ఇద్దరు చొప్పున ఇన్‌స్ట్రక్టర్లను నియమించింది. రోజూ గంట చొప్పున ఒక్కొక్క తరగతికి వీరు కంప్యూటర్ విద్యను అందించేలా షెడ్యూల్ తయారు చేశారు. ఇందుకుగాను ఒక్కొక్కరికి నెలకు రూ.3 వేలు నుంచి రూ.5 వేల వరకు వేతనం అందించారు. ఇందుకుగాను ప్రభుత్వం నిట్ సంస్థకు సుమారుగా రూ.493 కోట్లు వరకు చెల్లించింది. అనంతరం ఈ ఒప్పందం 2013 సెప్టెంబర్ నెలతో ముగియడంతో కంప్యూటర్ విద్య పూర్తిగా మూలకు చేరుకుంది.

పాఠశాలలో కంప్యూటర్ విద్య అందించాలి



ప్రస్తుత కాలంలో విద్యార్థులకు కంప్యూటర్ విద్య తప్పనిసరి. కార్పొరేట్ పాఠశాలల్లో ఇప్పటికే కంప్యూటర్ విద్యను బోధిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ విద్యాసంవత్సరం నుంచి అయినా ప్రభుత్వ పాఠశాలల్లో బోధకులను నియమించి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించేందుకు చర్యలు చేపట్టాలి. పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలి.

- జశ్విత, ఎనిమిదో తరగతి, ఓజిలి

కంప్యూటర్ విద్యకు ప్రాధాన్యత



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ విద్యకు ప్రాధాన్యత కల్పిస్తే కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశాలు ఉంటాయి. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ లో కంప్యూటర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.ఎక్కువగా ప్రైవేట్ విద్యార్థులే అధికంగా రాణిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను అందిస్తే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా రాణించగలరు.

- షేక్. రిహానా, తొమ్మిదో తరగతి, ఓజిలి

శ్రీకాళహస్తిలో 'నా భూమి.. నా దేశం'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్ : స్థానిక ఎం.పీ.డీ.వో కార్యాలయం ఆవరణలో శుక్రవారం 'నా భూమి.. నా దేశం' నియోజకవర్గ స్థాయి కార్యక్రమాన్ని ఎంపీడీవో పటాన్ రఫీఖాన్ అధ్యక్షతన నిర్వ హించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా జరిపిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎగువ వీధి పంచాయతీ సర్పంచ్ హేమ భూషణ్ రెడ్డి, తొట్టంబేడు వైసీపీ మండల కన్వీనర్ వాసు నాయుడు, శ్రీకాళహస్తి మండల జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, ఈవోపీఆర్డీ శారద దేవి, అలాగే ఏర్పేడు, రేణిగుంట మండల పార్టీ నాయకులు, ఆయా శాఖల అధికారులు నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

జయశంకర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



ప్రజాశక్తి-క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ, ఫిజిక్స్ విభాగం విశ్రాంతాచార్యులు, వర్సిటీ మాజీ రెక్టార్ డా. సికె. జయశంకర్ "బెస్ట్ రేర్ ఎర్త్స్ ఔట్రీచ్ అవార్డ్" కు ఎంపికయ్యారు.ఆయన చేసిన కృషికి రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ ప్రతిష్టాత్మక గుర్తింపునిచ్చింది. 17న గోవాలో ఇంధన భద్రత కోసం జరిగిన రేర్ ఎర్త్స్ -2023 పై అంతర్జాతీయ సదస్సు ప్రారంభ సెషన్‌లో ఈ అవార్డును అందించారు. ఈ అవార్డును గౌరవనీయులైన డా.అజిత్ కుమార్ మొహంతి, ఛైర్మన్, అటామిక్ ఎనర్జీ కమిషన్, సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ, ముంబై దీపేంద్ర సింగ్, ఆర్ఇఎఐ ప్రెసిడెంట్, ఐఆర్ఈ ఎల్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అందించారు. ఎస్వీయూలో 34 సంవత్సరాలు పరిశోధనలు చేసి లేజర్‌లు, ఆప్టికల్ ఫైబర్ యాంప్లిఫైయర్‌లు, సెన్సార్‌లు, బయోలేబుల్‌లు, డబ్ల్యూ ఎల్ఈడి మరియు బరీడ్ వేవ్‌గైడ్‌లు వంటి వివిధ అప్లికేషన్‌ల కోసం అరుదైన ఎర్త్-డోప్డ్ ఆప్టికల్ క్వాలిటీ గ్లాసెస్/నానో-గ్లాస్ సిరామిక్స్ మరియు నానోక్రిస్టలైన్ మెటీరియల్‌లు తయారు చేశారు. రేర్ ఎర్త్ అసోసియేషన్ కార్యదర్శి డా.ఎం.ఎల్.పి.రెడ్డి, ఆచార్య దేవప్రసాద్ రాజు, పరిశోధకులు, తదితరులు అభినందించారు.

ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-పిచ్చాటూరు: అడవికొడియంబేడు సర్పంచ్, గోవర్ధనగిరి 7వ వార్డు ఎన్నికకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఎన్నికల సామాగ్రితో పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎంపీడీవో కార్యాలయం నుండి బయలుదేరి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తామన్నారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ఆపై ఫలితాలు వెల్లడించనున్నట్లు ఆయన వివరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కేవీబీపురం: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన సంఘటన కెవిబిపురం మండలం కలత్తూరు దళితవాడలో శుక్రవారం జరిగింది. ఇంటి పైన విద్యుత్ వైర్లు తెగి పడి ఉండటంతో తొలగించే క్రమంలో చిరంజీవి (32)విద్యుత్ షాక్‌కు గురైమృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో డ్రైనేజీ పనులు జరుగుతుండటంతో మున్సిపల్ కమిషనర్ కె ఎల్ ఎం ఎన్ రెడ్డి, ఏ ఈ కలసి శుక్రవారం పర్యవేక్షించారు. మేరా మట్టి మేర దేశ్" కార్యక్రమం 19న శనివారం పుత్తూరు పురపాలక సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమంలో ప్రధాన కూడళ్లలో మొక్కలు నాటేందుకు మొక్కలు పరిశీలించారు.

డాక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 31వ తేదీన గూడూరు ప్రధాన పోస్ట్ ఆఫీస్‌లో డాక్ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నామని , ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు అర్జీ రూపంలో ఈనెల 30 వ తేదీ లోపు పోస్టులో పంపించ వచ్చు అని తపాలా సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.ఏ. కె కుమార్ తెలిపారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మార్కెట్లోకి మహీంద్రా తేలికైన ట్రాక్టర్లు

- 20హెచ్‌పీ నుంచి 40 హెచ్‌పీ సామర్థ్యం

-ప్రారంభ ధర రూ.5.64 లక్షలు



ప్రజాశక్తి-తిరుపతి సిటీ : మహీంద్రా అండ్ మహీంద్రా ఒకేసారి ఏడు ట్రాక్టర్లను విడుదల చేసింది. ఓజా ప్లాట్‌ఫాంలో విడుదల చేసినట్లు మహేంద్ర అండ్ మహేంద్ర అధ్యక్షులు హేమంత్ సిక్కా తెలిపారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ట్రాక్టర్లు తెలంగాణలోని జహీరాబాద్ ప్లాంట్లోనే తయారు చేయడం విశేషం అన్నారు. 20 హెచ్‌పీ సామర్థ్యం నుంచి 40 హెచ్‌పీ లోపు కెపాసిటీతో రూపొందించిన ఈ తేలికైన ట్రాక్టర్లను దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ వేదికగా ప్రవేశపెట్టింది. మహీంద్రా అండ్ మహీంద్రా ఒకేసారి ఏడు ట్రాక్టర్లను విడుదల చేసింది. ఓజా ప్లాట్‌ఫాంలో విడుదల చేసిన ఈ ట్రాక్టర్లు తెలంగాణలోని జహీరాబాద్ ప్లాంట్లోనే తయారు చేయడం విశేషం. 20 హెచ్‌పీ సామర్థ్యం నుంచి 40 హెచ్‌పీ లోపు కెపాసిటీతో రూపొందించిన ఈ తేలికైన ట్రాక్టర్లను దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ వేదికగా ప్రవేశపెట్టింది. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంతో ఓజా ప్లాట్‌ఫాంలో మరిన్ని మోడళ్లను పరిచయం చేయనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వీటిలో ఓజా 27 హెచ్‌పీ ట్రాక్టర్ ధరను సంస్థ రూ.5.64 లక్షలుగా నిర్ణయించింది. అలాగే 40 హెచ్‌పీ ట్రాక్టర్ మాడల్ ధర రూ.7.35 లక్షలు. తేలికైన ఈ ఓజా ట్రాక్టర్లు అత్యంత శక్తినివ్వనున్నాయని, ప్రగతిశీల రైతులను దృష్టిలో పెట్టుకొని రూపొందించినట్లు వెల్లడించారు. వచ్చే మూడేళ్లలో ట్రాక్టర్ల ఎగుమతులు రెండంతలు పెరిగే అవకాశం ఉందని సిక్కా పేర్కొన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 18 వేల ట్రాక్టర్లను భారత్ నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసినట్లు, అలాగే ఓజా ప్లాట్‌ఫామ్‌ను తీర్చిదిద్దడానికి రూ.1,200 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. వినియోగదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 25 వరకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-క్యాంపస్: జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించిన దరఖాస్తులను సమర్పించడానికి ఈనెల 25వ వరకు పొడగించడమైందని, ప్రవేశ పరీక్ష విధానం, దరఖస్తుల గురించి సమాచారం కోసం విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో పొందవచ్చని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.యన్.విశ్వనాథరెడ్డి తెలియచేశారు. మరిన్ని వివరాలకు 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించగలరని తెలిపారు.

శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో రాణిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి వ్యవసాయ రంగ పరిశ్రమలు నిర్వహిస్తున్న ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకొంటున్నట్లు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గతవారం గరుడ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 7 మంది ఉద్యోగాలను సాధించినట్లు అయన వివరించారు. ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగావకాశాలను మ అందిపుచ్చుకోవడంలో సఫలీకతులైన బి.ఎస్సీ (హాన్స్.) అగ్రికల్చర్ నుంచి శ్రీకాంత్, ప్రశాంత్ ఎమ్మెసి(అగ్రికల్చర్) నుండి పవన్ కళ్యాణ్, హరీష్, గాయత్రి, ఎం. బి. ఏ(అగ్రి బిజినెస్) నుండి వెంకట రాజా, సతీష్ లను అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి అభినందించారు. గరుడ కెమికల్స్ లిమిటెడ్ ఫలితాలతో పాటు విద్యార్థులు ఎంపిక సమయంలో ప్రతిభ కనబరిచినట్లు అభినందిచడం సంతోషకరమని అయన తెలియచేశారు. ఈ నెల 25 న వారు విధులలో చేరుతున్నట్లు అయన వివరించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఇన్‌ఛార్జి డా॥సీవీ సత్యగోపాల్ పాల్గొన్నారు.

మహిళపై అసభ్య ప్రవర్తన.. వ్యక్తి అరెస్టు



ప్రజాశక్తి -సత్యవేడు: మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండుకు పంపినట్లు సత్యవేడు పోలీసులు తెలిపారు. సత్యవేడు, శ్రీకాళహస్తి బస్టాండ్ వద్ద పెద్ద ఈటిపాకం గ్రామానికి చెందిన మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి ఉండగా బీసీ కాలనీకి చెందిన దినకరన్ అసభ్యంగా ప్రవర్తించి ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి నిందితుడు దినకరన్ ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు సత్యవేడు ఎస్ఐలు వెల్లడించారు.

గిరిజన రైతులకు పట్టాలు మంజూరు చేయాలి



ప్రజాశక్తి - ఓజిలి : గిరిజన రైతులకు ప్రభుత్వ భూమి కల్పించి పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు పేర్కొన్నారు. ఓజిలి మండల పరిధిలోని కుందాం రాజుపాలెం గ్రామంలో గిరిజన రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ గిరిజనులు సాగు భూమి లేక జీవన ఉపాధి కోల్పోతున్నారని..సాగు భూమి కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ అధికారుల్లో చలనం లేకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. గిరిజనులకు సాగు భూములు లేక వలసలు వెళుతున్నారని.. ఈ వలసలను అరికట్టేందుకు గిరిజన రైతులకు సాగుభూమి కల్పించి వారికి జీవనోపాధికి తోడ్పాటు ఇవ్వాలని పలుమార్లు అధికారులు దృష్టికి తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఓజిలి మండలంలో పెత్తందారులు అడ్డగోలుగా వందలాది ఎకరాలు ఆక్రమించుకొని దర్జాగా సాగు చేసుకుంటుంటే రెవెన్యూ అధికారులు మౌనం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన రైతులకు సాగుభూములు కల్పించని పక్షంలో ఉద్యమాలు పోరాటాలు బాట పడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ ముకుంద , గిరిజన రైతులు పాల్గొన్నారు.

వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటుచేయాలి



ప్రజాశక్తి-క్యాంపస్: వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలని.. ఇందుకోసం స్కూల్ కన్స్యూమర్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని తిరుపతి ఉప విద్యాశాఖధికారి ఆనందరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా ఆహారం, పౌర సరఫరాలశాఖ, జిల్లావిద్యా శాఖ ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఒక్కరోజు శిక్షణ మేక్ మై బేబీ జీనియస్ స్కూల్ తిరుపతి లో జరిగింది. తిరుపతి అర్బన్ మండల విద్యా శాఖధికారి బాలాజీ మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్స్, తూనికలు కొలతలలో జరిగే మోసాలు, వినియోగ దారుల హక్కులు, బాధ్యతలన్నీ విద్యార్థులు నేర్చుకొని తమ తల్లిదండ్రులకు నేర్పడంతో తెలివైన కొనుగోలు చెయ్యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నీలకంఠ, జిల్లా సమన్వయకర్త హరిశంకర్, విషయ జ్ఞానులు స్వయం ప్రభ, ఆమూరి సుబ్రహ్మణ్యం, లక్ష్మయ్య నాయుడు, రమేష్ బాబు, బాలాజీ, వాసయ్య, మనోహర్, హేమాద్రి, రుక్మిణి, నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఆచార్య జీయన్ రెడ్డి ధర్మనిధి ఉపన్యాసం



ప్రజాశక్తి-క్యాంపస్: మహాభారతంలోధర్మం సర్వకాలీనమైందని ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ సెనేట్ హాల్లో జరిగిన సదస్సులో ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు, తితిదే ధర్మప్రచార పరిషత్ పూర్వ కార్యదర్శి అయిన ఆచార్య కసిరెడ్డి " ఆంధ్రమహాభారతం-ధార్మిక అంశాలు" అనే అంశంపై ప్రసంగించారు. ఆంధ్రమహాభారతం అనేక జీవితాలు, సంఘటనలు, సన్నివేశాలు మనిషిని ధర్మబద్ధంగా నడుచు కోమని చెబుతాయని అన్నారు. ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి మాట్లాడుతూ మానవత్వం పరిమళించిన మహనీయుడు జియన్ రెడ్డి అని, తెలుగు ఆచార్యుడు తొలిసారి వైస్ ఛాన్సలర్ గా చరిత్ర సృష్టించారని, ఎస్వీయూలో ఎన్నో కోర్సులు, కట్టడాలు, ఉద్యోగాలు వారి కృషితో వచ్చాయని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖాధ్యక్షులు పాల్గొన్నారు.